## వామన అవతారంలో భద్రాద్రి రామయ్య

ప్రజాపక్షం/భద్రాచలం : భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయం ఆధ్వర్యంలో జరుగుతున్న ముక్కోటి అధ్యనోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారు వామన అవతారంలో భక్తులకు దర్శమిచ్చారు. స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పూజలు చేసి పల్లకీలో మిథిలా స్టేడియం వేదిక వద్దకు మేళతాళాల నడుమ తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తులు రామనామ స్మరణ చేశారు. వామన రూపంలో ఉన్న స్వామిని దర్శించుకోవడం వల్ల సకల బాధలు, అరిష్టాలు తొలగిపోతాయని భక్తుల అపార నమ్మకం. సాయంత్రం రాజవీధిలో తిరువీధి సేవ నిర్వహించారు.




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 05 | జనవరి | 2025

పేజీలు 8


### వాగ్దాన భంగంతో..

# రగులుతున్న అసంతృప్తి..!

-రైతు భరోసా ఏమి చేస్తారో...?

-మాట తప్పితే ఇబ్బందులు తప్పకపోవచ్చు



## రుణమాఫీపై రైతుల్లో నిరాశ

అంత్య నిష్టూరం కంటే అది నిష్టూరం మేలన్నది సామెత. అది అన్ని సందర్భాల్లోనూ అందరికీ వర్తిస్తుంది. తొలుత కాదని తర్వాత ఇచ్చే ఆనందం ఎంతగా ఉంటుందో ఇస్తానని ఇవ్వకపోతే కోపం, బాధ అంతకు రెట్టింపు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ రుణమాఫీ వ్యవహారంలో అచ్చు అదే జరిగింది. రెండు లక్షల రుణమాఫీ చేస్తాం. రెండు లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని రైతులు చెల్లిస్తే రెండు లక్షలు మేము రైతుల ఖాతాల్లో వేస్తాం అని మంత్రులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చెప్పారు. కానీ ఇప్పుడు అసలు రెండు లక్షల లోపు రుణమాఫీయే పూర్తి కాలేదన్నది రైతుల్లో ఉన్న ఆవేదన.

-ప్రజాపక్షం/ఖమ్మం

2లో

### ప్రతి నియోజకవర్గానికి

# 3,500 ఇండ్లు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్/ కూసుమంచి : రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఖమ్మం ఎంపి రామ సహాయం రఘురాంరెడ్డితో కలిసి

మిగతా 2లో..

-అసంపూర్తి ఇండ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

-అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శంకుస్థాపన

-లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

### కొత్తగూడెం రూపురేఖలు

# మార్చేందుకు కృషి



ప్రజాపక్షం/భద్రాచలం : త్వరలో కొత్తగూడెం రూపురేఖలు పూర్తిగా మారిపోబోతున్నాయని, ఇందు కోసం ప్రభుత్వం నుండి పెద్దఎత్తున సహాయా సహకారాలు అందుతున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం ఎంఎల్‌ఏ క్యాంపు

మిగతా 2లో..

- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయం
- జర్నలిస్టుల సంక్షేమానికి పెద్దపీట
- ఎంఎల్‌ఏ కూనంనేని
- కూనంనేనిని సన్మానించిన జర్నలిస్టులు

# వాగ్దాన భంగంతో..
# రగులుతున్న అసంతృప్తి..!



**ప్రజాపక్షం/ఖమ్మం :** అంత్య నిష్టూరం కంటే అది నిష్టూరం మేలన్నది సామెత. అది అన్ని సందర్భాల్లోనూ అందరికీ వర్తిస్తుంది. తొలుత కాదని తర్వాత ఇచ్చే ఆనందం ఎంతగా ఉంటుందో ఇస్తానని ఇవ్వక పోతే కోపం, బాధ అంతకు రెట్టింపు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ రుణ మాఫీ వ్యవహారంలో అచ్చు అదే జరిగింది. రెండు లక్షల రుణమాఫీ చేస్తాం. రెండు లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని రైతులు చెల్లిస్తే రెండు లక్షలు మేము రైతుల ఖాతాల్లో వేస్తాం అని మంత్రులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి మరీ చెప్పారు. కానీ ఇప్పుడు అసలు రెండు లక్షల లోపు రుణమాఫీయే పూర్తి కాలేదన్నది రైతుల్లో ఉన్న ఆవేదన. మూడు దఫాలుగా రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన తర్వాత దాదాపు రూ. 3వేల కోట్ల రూపాయలకు సంబంధించిన రైతు రుణాలు వివిధ కారణాల వల్ల మాఫీ కాలేదని ఇప్పుడు అన్ని ఆధారాలను సేకరించాం కాబట్టి వాటిని మాఫీ చేస్తున్నామని నవంబర్ 30న స్వయనా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడమే గాక రూ. 3వేల కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. కానీ ఇంత వరకు ఏ రైతు ఖాతాల్లోనూ డబ్బులు జమ చేసిన దాఖలాలు లేవు. బ్యాంకు అధికారుల చుట్టూ రెండు లక్షల లోపు ఉన్న రైతులు తిరుగుతున్నా ఇదిగో అదిగో అంటున్నారు తప్ప రుణమాఫీ మాత్రం జరగడం లేదు. దీని మీద క్షేత్రస్థాయి అధికారుల నుంచి ఉన్నతస్థాయి అధికారుల వరకు ఎవరి వద్ద సరైన సమాధానం లేదు. ఎందుకు రెండు లక్షల లోపు రుణమాఫీ జరగడం లేదో అర్థం కానీ పరిస్థితి. ఇక రెండు లక్షల పైన ఉన్న రైతులు మంత్రుల మాట విని తమకు తప్పనిసరిగా రెండు లక్షల రుణమాఫీ జరుగుతుందని ఆశ పడ్డారు. గతంలో పలుమార్లు మీడియా సమావేశాల్లోనూ, సభల్లోనూ పదే పదే ప్రకటించిన ఏ మంత్రి కూడా ఇప్పుడు రెండు లక్షలపైబడి ఉన్న రుణాల ఊసెత్తక పోవడం గమనార్హం. రుణ మాఫీ పరిస్థితి ఈవిధంగా ఉంటే డిసెంబర్ మాసంలో రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, ఆర్థిక శాఖ మంత్రి కూడా అయిన మల్లు భట్టివిక్రమార్క భూమి లేని నిరుపేదల ఖాతాల్లో డిసెంబర్ 28న కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రూ. 12వేలు జమ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత దానిని కొద్దిగా సవరించి రెండు విడతల్లో ఆరువేల రూపాయల చొప్పున జమ చేస్తామని ప్రకటించారు. 28న ఏ పేద వాని ఖాతాల్లోనూ రూపాయి జమ చేసింది లేదు. ఆ తర్వాత దీనిని గురించి ఎక్కడ ప్రస్థావించక పోవడం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. పేదలకు ఏడాదికి రూ. 12వేల పథకాన్ని ప్రారంభిస్తారా లేక మరెమైనా పునరాలోచనకు వెళ్తారా అన్న దానిపై కూడా స్పష్టత లేదు. అసలు రూ. 12వేలు ఇచ్చే లబ్దిదారులను ఎలా ఎంపిక చేస్తారన్నది కూడా ఇంత వరకు తేల్చలేదు. భూమి లేని నిరుపేదలని అంటున్నారు. భూమి లేని వారిలో కూడా అనేక మంది ధనవంతులు ఉన్నారు. రెండవది జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వారిని ఎంపిక చేసే అవకాశం ఉంటుందంటున్నారు. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్నాయి. దీనిని బట్టి నిరుపేదల ఎంపికకు ఒక ప్రత్యేకమైన సర్వే నిర్వహిస్తే తప్ప లేకపోతే అనర్హులు కూడా లబ్ది పొందే అవకాశం ఉంది. అనర్హులు ఎక్కడో ఒక చోట లబ్ది పొందిన అంతగా ఇబ్బంది లేదు కానీ అర్హులకు ఈ పథకం చేరకపోతే ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పడుతుంది. రైతుభరోసాకు సంబంధించి విధి విధానాలను ఖరారు చేసేందుకు మంత్రి వర్గ ఉప సంఘం ప్రజాభిప్రాయ సేకరణ చేసిన తర్వాత రెండు మూడుసార్లు సమావేశమైంది. సమావేశం సారాంశం పూర్తిగా బయటకు రాకపోయినా భూమికి సంబంధించి ఎటువంటి కోతలు ఉండవని సాగు భూమి ఎంత ఉన్నా రైతు భరోసా వర్తింపజేస్తారన్న వార్తలు బయటకు వచ్చిన నేపథ్యంలో రైతులు దీనిని స్వాగతిస్తున్నారు. కానీ సాగు భూమి నిర్ధారణ కూడా అంత తేలికైన విషయం కాదు. ఇప్పటికే జాప్యం జరిగిన రైతు భరోసాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పలుమార్లు ప్రకటించిన విధంగా సంక్రాంతికి రైతుల ఖాతాల్లో జమ చేయాలి దీనికి సంబంధించి కూడా రైతుల నుంచి ఒక బలమైన వాదన వినపడుతుంది. వ్యవసాయ అధికారులకు ఎవరు ఏ పంట సాగు చేశారో రికార్డుల్లో నమోదై ఉంది కాబట్టి మరల దరఖాస్తులు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు వాగ్దానాలను ఇచ్చినవిధంగా అమలు చేస్తుంది. ఒకటి ఉచిత బస్సు, రెండు గృహ జ్యోతి, ఉచిత బస్సులో కూడా బస్సుల సంఖ్య పెరగకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు ప్రభుత్వ తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గృహజ్యోతికి సంబంధించి చిన్న చిన్న సమస్యలు ఉన్న ఆ పథకం సాఫీగానే సాగుతుందన్న భావన వ్యక్తమవుతుంది. ఇక గ్యాస్‌కు సంబంధించి 60 శాతం మంది ఖాతాలలో నగదు జమ కావడం లేదన్న ఆరోపణ వినవస్తుంది. మొత్తంగా రాష్ట్ర ప్రభుత్వం పదే పదే వాగ్దాన భంగానికి పాల్పడుతుండడంతో ప్రజల్లో అసంతృప్తి మొదలైంది. రుణమాఫీతో పాటు రైతు భరోసా పైన తక్షణ నిర్ణయం తీసుకుని రైతులను సంతృప్తి పర్చడంతో పాటు ప్రభుత్వ సానుకూలత పెంచుకునే దిశగా ఆలోచన చేయాలని కోరుతున్నారు.

# కొత్తగూడెం రూపురేఖలు మార్చేందుకు కృషి

(మొదటిపేజీ తరువాయి)

కార్యాలయంలో ఆయన విలేకరులతో శనివారం చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్తగూడెం నియోజకవర్గం రూపురేఖలు పూర్తిగా మార్చేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేశామని చెప్పారు. రాష్ట్రంలోనే ఈ నియోజకవర్గం ఆదర్శ నియోజకవర్గంగా మార్చేందుకు కృషి చేస్తున్నామని, ఇందు కోసం ప్రభుత్వాన్ని ప్రతిపాదనలు సైతం పంపించామని, ప్రతీ ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందన్నారు. పాల్వంచ కేటిపిఎస్‌లో 800 మెగావాట్ల విద్యుత్ నూతన ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రభుత్వానికి నివేదకలు అందించామని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతమైన పాల్వంచలో మూతపడిన పరిశ్రమలను తిరిగి తెరిపించే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు పాటుపడుతన్నామన్నారు.సుజాతనగర్‌కొత్తగూడెంపాల్వంచలను కలుపుకుని మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని, తద్వారా అన్ని గ్రామాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. రామవరం శివారు ప్రాంతం ఎయిట్ పోర్టుకు అనువైన ప్రాంతంగా ఉందని, అక్కడ ఎయిల్ పోర్టు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని వివరించారు. కేంద్రీయ విద్యాలయాన్ని కూడా కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అందుకు సంబంధించి స్థలాన్ని కూడా త్వరలో ఖరారు చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. పాల్వంచ నుండి రామవరం వరకు బైపాస్ రోడ్డును పూర్తి చేసి ట్రాఫిక్ సమస్య నివారణకు చర్యలు తీసుకుంటామని, కొత్తగూడెం పట్టణంలో రద్దీని తగ్గించేందుకు చాలా వరకు ఈ బైపాస్ రోడ్డు ఉపయోగపడుతుందని, పెద్దపెద్ద వాహనాలు పట్టణంలోని రాకుండా అటుగా దారిమళ్లిస్తే ట్రాఫిక్ నియంత్రణ అవుతుందన్నారు.

**జర్నలిస్టుల సంక్షేమానికి కృషి ...**

జర్నలిస్టు సంక్షేమానికి పెద ఎత్తున కృషి చేస్తున్నట్లు ఎంఎల్‌ఏ ఈ సందర్భంగా చెప్పారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు సంబంధించి ప్రభుత్వానికి లేఖను సమర్పించామని, ఇందుకు స్పందించిన ప్రభుత్వం కలెక్టర్‌కు ఆదేశాలను జారీ చేసిందన్నారు. త్వరలో ఇళ్ల స్థలాలు అందించేందుకు కృషి చేస్తామని, ఇప్పటికే గుర్తించిన పది ఎకరాల ల్యాండ్‌ను జర్నలిస్టులకు కేటాయించేలా చూస్తామని, దాంట్లో వేరే కేటాయింపులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెబుతూ ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేయాలని మున్సిపల్ కమీషనర్‌ను అక్కడి నుండే ఆదేశించారు. గతంలో కూడా తాను ఎంఎల్‌ఏగా ఉన్న సమయంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు అందించామని చెప్పారు.అర్హులైన ప్రతీ ఒక్క జర్నలిస్టుకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

**కూనంనేనికి సన్మానం...**

జర్నలిస్టుల సంక్షేమం కోసం పాటుపడుతూ ప్రభుత్వానికి ఇళ్ల స్థలాల విషయంలో లేఖ సమర్పించి కార్యాచరణ ముందుకు సాగేలా కృషి చేసిన ఎంఎల్‌ఏ కూనంనేనిని జర్నలిస్టులు సన్మానించారు. పలు సమస్యలను ఆయన దృష్టికి జర్నలిస్టులు తీసుకెళ్లగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందని, నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కృషి జరుగుతున్నందున జర్నలిస్టులు సహకరించాలని కూనంనేని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా తో పాటు జర్నలిస్టులు ఉదయ్, రాజేంధర్, లక్ష్మణ్, వాహబ్, డి వెంకటేశ్వర్లు, ప్రవీణ్, నవీన్,సుధాకర్, తో పాటు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు

(మొదటిపేజీ తరువాయి)

కూసుమంచి మండలంలో పర్యటించారు. ఉపాధి హామీ నిధులు రూ. 15 లక్షలతో కూసుమంచి మండలం లోక్యాతండా గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణ పనులకు రూ. 20 లక్షలతో కోక్యాతండా గ్రామంలో, రూ. 19 లక్షలతో లింగారం తండాలో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నేలకొండపల్లి మండలానికి చెందిన 42 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 16,01,500, కూసుమంచి మండలానికి చెందిన 62 మంది లబ్దిదారులకు మంజూరైన రూ. 18,80, 500 చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో పేదలు కుటుంబంతో సంతోషంగా, ఆరోగ్యంగా ఉండేవిధంగా భగవంతుడు ఆశీర్వదించాలని కోరుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మార్పు కావాలని పేదలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా ఇచ్చిన ప్రతి మాట నెరవేర్చాలనే ధృడ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 80 లక్షల మంది ఇండ్లు కావాలన దరఖాస్తు చేశారని ఇప్పటి వరకు 64 లక్షల దరఖాస్తుల సర్వే ఈ యాప్ ద్వారా పూర్తి చేశామని మిగిలిన దరఖాస్తుల సర్వే మరో నాలుగు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. గతంలో వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్లను కూడా సంక్రాంతి లోపు పంపిణీ చేస్తామని తెలిపారు. అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు. గ్రామాల్లో త్రాగునీటి సరఫరాకు అధికారులు యుద్ద ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. రైతులు, యువకులు, మహిళల సంక్షేమం కోసం ఇందిరమ్మ రాజ్యం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్‌ఈ హేమలత, ఇరిగేషన్ ఎస్‌ఈ వెంకటేశ్వరరావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పిఆర్‌ఈఈ వెంకటరెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, వ్యవసాయ శాఖ ఏడిఏ సరిత, ఎంపిడివో వేణుగోపాల్ రెడ్డి, ఇంచార్జి తహసీల్దార్ కరుణశ్రీ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా రామారావు



**ప్రజాపక్షం/వైరా:** వైరాకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మచ్చా రామారావును టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ మెంబర్‌గా నియమిస్తూ నియామక పత్రాన్ని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మచ్చా రామారావు మాట్లాడుతూ ఈ పదవికి తనను ఎంపిక చేయడం పట్ల ఎంపి రామసహాయ రఘురామిరెడ్డికి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కి, తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్‌కు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# డిడిఎన్‌ఏ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మంజిల్లా ధూప దీప నివేదన అర్చక సంఘం (డిడిఎన్‌ఏ) 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. శనివారం ఖమ్మంలో జరిగిన కార్యక్రమంలో ధూప దీప నివేదన అర్చక సంఘం బాధ్యులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంత్రి చేతులు మీదుగా ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రం 2025 సంవత్సరంలో అభివృద్ధి పదంలో పయనించేలా భగవంతుని అనుగ్రహం కావాలని అర్చకులంతా రాష్ట్రం సుభిక్షంగా, సుసంపన్నంగా ఉండేందుకు ప్రార్థించాలని మంత్రి సూచించారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఘనంగా సత్కరించారు. అర్చకుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నావజ్జల ప్రసాద్‌శర్మ, జిల్లా అధ్యక్షులు మునగలేటి రమేష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి మరింగంటి భార్గవాచార్యులు, పలు మండలాల అధ్యక్షులు ఇంగువ పూర్ణానంద శర్మ, అనిపెద్ది యశ్వంత్ శర్మ, అవధానుల సీతారామ శర్మ, గూడ పాండురంగయ్య శర్మ, కురుమేటి రామకృష్ణ శాస్త్రి, చిలుకూరు వెంకట నాగమూర్తి, గణపతి బోట్ల లక్ష్మి నారాయణ శర్మ, కొత్తూరు రాజేశ్వర శర్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇంగువ సంగమేశ్వర ప్రసాద్ శర్మ, నందుల ఉదయ్ శర్మ, పలువురు అర్చకులు పాల్గొన్నారు.

# సమాజాభివృద్ధికి జర్నలిస్టుల పాత్ర కీలకం

**- ప్రెస్ క్లబ్ ఆఫ్ భద్రాచలం క్యాలెండర్ ఆవిష్కరణ**

**- ఆవిష్కరించిన పొదెం, తెల్లం**






**ప్రజాపక్షం/భద్రాచలం :** సమాజాభివృద్ధికి జర్నలిస్టు పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య, స్థానిక ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్ ఆఫ్ భద్రాచలం నూతన సం. క్యాలెండర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోనికి తీసుకొస్తూ పరిష్కారానికి అలుపులేని పోరాటం సాగించేది జర్నలిస్టులే అన్నారు. అటువంటి జర్నలిస్టులకు ప్రజాప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి జరుగుతుందని, ఇందిరమ్మ ఇల్లు తదితర సంక్షేమ పథకాలు అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నూతన సం.2025 క్యాలెండర్ ఆవిష్కరించడం ఆనందంగా ఉందని, ఈ ఏడాది జర్నలిస్టులంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేసూ ప్రజలు, అధికారుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బివి రమణారెడ్డి, ఉపాధ్యక్షులు సోముల గిరి ప్రసాద్, కోశాధికారి వై దుర్గారెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎర్రంశెట్టి కృష్ణ, శ్రీశ్రీ, రాజాకిరణ్, రంజిత్, కిరణ్, అఖిల్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ఏరా చెల్లమ్మ.. చాయ్ సూపర్...



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఏరా చెల్లమ్మ...నీదేనా రా షాప్...ఏం రెడీ చేశావ్.. వాహ్ భలే ఉంది రా చాయ్ అంటూ ఇందిర మహిళాశక్తి ఆధ్వర్యంలో టీస్టాల్ ఏర్పాటు చేసిన మహిళను తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అభినం

**- ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్ ప్రారంభోత్సవంలో మంత్రి పొంగులేటి**

దించారు. శనివారం ఖమ్మంరూరల్ మండలం వరంగల్‌క్రాస్‌రోడ్‌లో ఏర్పాటు చేసిన ఆ టీస్టాల్‌ను మంత్రి పొంగులేటి, ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. మహిళలు స్వశక్తితో ఎదగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరా మహిళ శక్తి పేరుతో రుణాలు ఇప్పించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. కావున మహిళలు సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా బలపడాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దినల్లారెడ్డి, అంబటి సుబ్బారావు, బండి జగదీష్, భూక్యా సురేష్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ యువజన నాయకులు తమ్మినేని నవీన్, మద్దులపల్లి మార్కెట్ డైరెక్టర్ తేజావత్ పంతుల్‌నాయక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు సురేష్, కళ్లెం శేషిరెడ్డి, కొక్కు రాజు, అధికారులు పాల్గొన్నారు.

# సీతారత్నం ట్రస్టు సేవలు అభినందనీయం







**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యారంగానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఖమ్మం సిడిపివో వీరభద్రమ్మ తెలిపారు. శనివారం ఖమ్మం నగరంలోని కొత్తూరు 2 అంగన్‌వాడీ కేంద్రంలో పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గురు గర్భిణీలకు సీమంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపివో వీరభద్రమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాలలో మౌలిక వసతుల కల్పనకు ట్రస్టు తరుపున పరిశ పుల్లయ్య అందిస్తున్న చేయూత మరువలేనిదన్నారు. గర్భిణీలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ట్రస్టు చైర్మన్ పరిశ పుల్లయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవన నిర్మాణం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం సెక్టార్ పర్యవేక్షకులు మోతుకూరి కోటేశ్వరమ్మ, అంగన్‌వాడీ ఉపాధ్యాయుని వి. వెంకట నాగమణి, ఆయా సీతమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంగన్‌వాడీ ఉపాధ్యాయుని వెంకటనాగమణి,ఆయా సీతమ్మను ఘనంగా సత్కరించారు.

# నాగేంద్రబాబు సేవలు ఆదర్శనీయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** విద్యా రంగానికి నాగేంద్రబాబు అందించిన సేవలు పలువురికి ఆదర్శ ప్రాయమని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వరరావు తెలిపారు. రోటరీనగర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులుగా పనిచేస్తూ డి. నాగేంద్రబాబు పదవి విరమణ పొందారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో హెచ్‌ఎం పి. పద్మ అధ్యక్షతన అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వైవి మాట్లాడుతూ 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన నాగేంద్రబాబు ఎక్కడ పనిచేసినా పదవ తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేశారన్నారు. ఉత్తీర్ణతతో పాటు పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు గ్రామస్తుల సహకారంతో కృషి చేశారన్నారు. నాగేంద్రబాబు సేవలు పలువురికి ఆదర్శంగా నిలిచాయన్నారు. రిటైర్డ్ హెచ్‌ఎం మధు మాట్లాడుతూ అందరిని ఆప్యాయంగా, ప్రేమగా పలకరిస్తూ పాఠశాల అభివృద్ధిలో నాగేంద్రబాబు చేసిన సేవలను గుర్తు చేశారు. నాగేంద్రబాబు దంపతులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామకృష్ణ, గాయత్రి, రమ, ఎం. పద్మ, సుజాత, పిఆర్‌టియు మాజీ అధ్యక్షులు ఎన్. కృష్ణమోహన్, చలపతిరావు, డి.రామారావు, డివి రామన్, విజయ్‌అమృత్ కుమార్, శేఖర్, గుడిపూడి శ్రీనివాసరావు, రవికిరణ్, రమణారావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో విశ్రాంత ఉద్యోగులు భాగస్వామ్యం వహించాలి



**ప్రజాపక్షం/బోనకల్:** ఉద్యోగ విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవా కార్యక్రమాలలో భాగస్వామ్యం వహించాలని మండల విద్యాశాఖ అధికారి దామాల పుల్లయ్య కోరారు. మండలంలోని పెద్దబీరవల్లి ఉన్నత పాఠశాలలో జల్లా సత్యనారాయణ పదవి విరమణ మహోత్సవం శనివారం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తిలో జల్లా సత్యనారాయణ ఎంతోమంది విద్యార్థులకు విద్యాబోధన చేసి తీర్చిదిద్దారని కొనియాడారు. ఉపాధ్యాయులు సత్యనారాయణను ఆదర్శంగా తీసుకొని విద్యార్థుల పట్ల స్నేహ భావంగా మెలగాలని కోరారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని, లక్ష్యాలను సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు చింతలచెర్వు కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు జి శ్రీనివాసరావు, డి శారద, ఏఎపిసి చైర్మన్ మహబూబ్‌బీ, రైతు సంఘం నాయకులు దొండపాటి నాగేశ్వరరావు, కిలారు సురేష్, బంధం శ్రీను, యువజన సంఘం నాయకులు కర్లకుంట నరేష్, గ్రామ మాజీ సర్పంచ్ ఆళ్ల పుల్లమ్మ, గిరిజన సంఘం నాయకులు గుగులోత పంతులు, టిఎస్‌యూటిఎఫ్ జిల్లా కార్యదర్శి గుగులోత్ రామకృష్ణ, ఉపాధ్యాయులు మండేపూగి నరేష్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పివి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కోయచలక గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సిఫారసు మేరకు బస్వోజి నాగమ్మ, నాయిని అపర్ణ లకు మంజూరైన చెక్కులను కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెరుకూరి పూర్ణచందర్‌రావు, మాధంశెట్టి హన్మంతరావు, చెరుకూరి సీతారాములు, మేళ్లచెరువు రాంప్రసాద్, మాధంశెట్టి సీతారాములు, చెరుకూరి కృష్ణారావు, బలుసుపాటి ఏసు, శేషయ్య, అమరం పరమయ్య, అమరం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాల కొరకు దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కార్మికుల పిల్లలు, కార్మికులు ఉపకార వేతనాల కొరకు ఫిబ్రవరి 15 లోగా దరఖాస్తు చేసుకోవాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కె. విజయభాస్కర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు , కార్ఖానాలు, మోటార్ రవాణా సంస్థలు, సహకార సంస్థలు, ఇతర ట్రస్టులలో పనిచేయుచున్న కార్మికుల పిల్లలు, కార్మికులకు ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలను అందించనున్నట్లు తెలిపారు. 2023 24 విద్యా సంవత్సరంలో పదవ తరగతి, ఐటిఐ కోర్సు ఉత్తీర్ణులైన వారికి రూ. 1000, పాలిటెక్నిక్ కోర్సుకు రూ. 1500, ఇంజనీరింగ్, మెడిసిన్, లా, బియస్సి, బిసిఏ, ఎంసిఏ, బిఫార్మసి, ఎం ఫార్మసి, బిబిఏ, ఎంబిఏ, పిజి డిప్లోమా ఇన్ మెడికల్ లాబోరేటరీ టెక్నీషియన్ కోర్సు ఉత్తీర్ణులైన వారికి రూ. 2వేలు ఉపకార వేతనం చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు మే డే నాటికి లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఆయన తెలిపారు.

## హమాలీ కూలీ రేట్లు పెంచాలి





**ప్రజాపక్షం/తల్లాడ :** పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా తల్లాడ పట్టణంలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు వేతనాలు పెంచాలని టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య వ్యాపార వర్గాలను డిమాండ్ చేశారు. శనివారం తల్లాడ పట్టణంలో హమాలీ బ్రాంచ్ కమిటీ అధ్యక్షులు పటాన్ నాగుల్‌మీరా అధ్యక్షతన జరిగిన జనరల్‌బాడీ సమావేశంలో వారు ముఖ్యఅతిధిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లాలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతుంటే కార్మికుల వేతనాలు మాత్రం చాలా దారుణంగా ఉన్నాయని, అనునిత్యం చమటోర్చి పనిచేసిన కార్మికులకు వేతనాలు సరిపోవడం లేదని, దీని వలన కుటుంబాలను సాకే పరిస్థితి లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశంలో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.శ్రీనివాసరావు, హమాలీ సంఘం నాయకులు గార్లపాటి నాగేశ్వరరావు, నల్లగొండ వెంకన్న, దుగ్గిదేవర రాఘవరావు, చాపల రామకృష్ణ, కృష్ణయ్య, రంగయ్య, దాసరి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ప్రతిభపాటవ పరీక్షకు ఆసిఫ్ ఎంపిక



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం పినపాక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్.ఆసిఫ్ శనివారం శాంతినగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన సాంఘిక శాస్త్ర జిల్లా స్థాయి ప్రతిభ పాటవ పరీక్షలో అత్యంత ప్రతిభను చూపి మూడోస్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పరీక్షకు ఎంపికయ్యాడు. ఈసందర్భంగా పాఠశాల హెచ్ఎం నర్సింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉమ్మడిగా కాపాడుకోవాలని, భవిష్యత్‌లో ప్రభుత్వ పాఠశాల ఉనికి ప్రశ్నార్థకం కాకుండా ఉండాలంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉమ్మడిగా కృషి చేయాలని కోరారు. రాష్ట్రస్థాయి ప్రతిభపాటవ పరీక్షకు ఎంపికైన షేక్.ఆసిఫ్‌ను ఆయనతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

## ఎంపి రఘురాంరెడ్డిని కలిసిన లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ తల్లాడ :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డిని తల్లాడ మండలంలోని రంగంబంజర గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పగడాల లచ్చిరెడ్డి శనివారం ఖమ్మంలోని ఎంపి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపి నిధులతో తల్లాడ మండలాన్ని అభివృద్ధిలో ముందుంచాలని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎంపి రఘురాంరెడ్డి మాట్లాడుతూ తల్లాడ మండల అభివృద్ధిలో తన సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## మంత్రి, ఎంపికి విషెష్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి జిల్లా కాంగ్రెస్ నాయకులు భూక్య సురేష్‌నాయక్ శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో మార్యదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి విషెష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ వంగూరి రవి, పాలేరునియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బాణోత్ కిరణ్, రూరల్ మండల యువజన అధ్యక్షులు రమణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టులో రేమిడిచర్ల విద్యార్థిని హవా



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా వారి ఆధ్వర్యంలో శనివారం ఇంగ్లీష్ ఒలంపియాడ్ పరీక్ష, ఉపన్యాస పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రేమిడిచర్లకు చెందిన తొమ్మిదో తరగతి చదువుతున్న పెండ్లి జావలికి తెలంగాణ ఒలంపియాడ్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని దక్కించుకుని ఈ నెల 18నజరుగబోయే జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక కావటం జరిగింది. ఉపన్యాస పోటీలో కూడా పెండ్లి జావలి చక్కగా తన ప్రతిభను కనబర్చిన మండలస్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జావలిని హెచ్ఎం కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ వారు అభినందించారు.

## ఈనాడు ఛాంపియన్స్ ట్రోఫీలో ఎర్రుపాలెం ఎస్‌జెకెఎం కళాశాల విద్యార్థులు



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఖమ్మంలో నిర్వహిస్తున్న ఈనాడు ఛాంపియన్స్ ట్రోఫిలో భాగంగా కబడ్డీ విభాగం నందు ఎర్రుపాలెం ఎస్‌జెకెఎం జూనియర్ కళాశాల విద్యార్థులు మొదటిస్థానం కైవసం చేసుకున్నారు. శని వారం జరిగిన కబడ్డీ పోటీల్లో వైరా, సత్తుపల్లి ఖమ్మం జట్ల మీద గెలుపొంది మొదటిస్థానాన్ని కైవసం చేసుకున్నారని కళాశాల డైరెక్టర్ దండం సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయనతో పాటు మేనేజ్మెంట్ సభ్యులు నాగిరెడ్డి సౌజన్య, మిరియాల శ్యాంప్రసాద్, నాగేశ్వరరావు అభినందించారు.

## యుటిఎఫ్ స్వర్ణోత్సవ పతాక జాతాకు ఘనస్వాగతం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఈనెల 5నుండి8 వరకు కాకినాడలో జరుగు యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల జాతరను విజయవంతం చేయాలని, చేపట్టిన జాతాకు ఖమ్మం రూరల్ మండలంలో శనివారం ఘన స్వాగతం లభించింది. ఇక్కడి యుటిఎఫ్ సం ఘం ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికి బస్సుతో పాటుగా ర్యాలీగా జాతరను ముందుకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో టియస్ యుటిఎఫ్ రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి ఎమ్ మహేష్, ఖమ్మం రూరల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నార్ల నవీన్‌కుమార్, పణితి మహేష్, ఉపాధ్యాయులు ప్రసాద్‌రావు, సతీష్, ఆమంచి సత్యనారాయణ, షాబుద్దీన్, పర్మా, కలీముల్లా, నాగులమీరా, చందు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ మద్దిశెట్టికి మరో డాక్టరేట్



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ప్రధాని జిల్లా ప్రాంతీయం భాస్కర్ థియేటర్‌లో డిసెంబర్ నెల 24వ తేదీన మధ్యాహ్నం జరిగిన సన్మాన సభలో అవార్డు సన్మాన సభలో మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకు అమెరికా గవర్నమెంట్ డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ వారు డాక్టర్ ఎమోస్ జేమ్స్ పిహెచ్డి చాన్సర్ డిఐవియు ఇండియన్ మరియు డాక్టర్ కే పాల్ శామ్యూల్ పిహెచ్డి చైర్మన్ డిఎయుఎస్ఏ డాక్టర్ కింగ్ ది మెయిన్ వైస్ ప్రెసిడెంట్ డిఏయూ ఇంగ్లాండ్ డాక్టర్ సిరీస్ పిహెచ్ ఆఫ్రికా వారు డాక్టర్ సర్టిఫికెట్ తో పాటు, గోల్డ్ మెడల్ మెమెంటో తో డాక్టర్‌ని ఘనంగా సత్కరించారు. ఈ సన్మాన సభలో ప్రముఖ సినీ నిర్మాత రామకృష్ణ గౌ, ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్, సినీ నటుడు శశి, ముంతాజ్, కిరణ్, రుద్రా స్టూడియో శ్రీనివాస్, హలో ప్రసాద్, మెగా ఎంటర్ప్రైజెస్ అభినేత్రి శిరీష రెడ్డి , సినిమా నటులు పాల్గొన్నారు. విద్యా రంగంలో ఉపాధ్యాయుని పాత్ర అనే అంశంపై డాక్టరేట్ లభించినందుకు నాకు చాలా ఆనందంగా ఉందని డాక్టర్ వెంకటేష్ పత్రికలకు తెలిపారు. డాక్టర్ ఎమోస్ జేమ్స్, పిహెచ్డి క్యాన్సిలర్ డిఏయు ఇండియా వారు సార్ ని ప్రత్యేకంగా అభినందించారు.

## పంతంగి రత్తయ్య మృతి పట్ల సిపిఐ సంతాపం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు మండలం రాజీవ్ గాంధీ నగర్ వాసి పంతంగి రత్తయ్య (87) శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, మహిళా సమైఖ్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సీపీఐ మణుగూరు పట్టణ కార్యదర్శి దుర్గ్యాల సుధకర్, మహిళ సమైక్య మండల కార్యదర్శి దుబ్బాక నిర్మల, ప్రమీల, సుజాత, ఏఐటియుసి కోశాధికారి కొత్తపల్లి సీతారాములు తదితరులు హాజరై పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. వీరిది పార్టీ కుటుంబమని వారు అన్నారు.

# సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్పీ రోహిత్ రాజ్



**ప్రజాపక్షం/మణుగూరు :** మణుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 92 సిసి కెమెరాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ రాకను పురస్కరించుకొని పోలీస్ స్టేషన్లో అన్ని ఏర్పాట్లను డిఎస్పి వంగ రవీంద్రారెడ్డి, సీఐ సతీష్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ ముందుగా పోలీస్ స్టేషన్లో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ఏమైనా సమస్యలు ఉన్నాయా ఉంటే నా దృష్టికి తీసుకొని రండి అని, ఎస్పీ సిబ్బందిని కోరారు. ఆ తర్వాత ఎస్పీ పోలీసుల రూర్కాల్ వందనాన్ని స్వీకరించారు. ఎస్పీ రోహిత్ రాజుకు డిఎస్పి వంగా రవీంద్రారెడ్డి జ్ఞాపకంగా పుష్పగుచ్చం అందజేసి ఆహ్వానించారు. పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన 92 సీసీ కెమెరాలు ఎస్పీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సీసీ కెమెరాలు పరిధి మణుగూరు అంబేద్కర్ సెంటర్ నుంచి రైల్వే గేట్ వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. ఈరోజు నుంచి సీసీ కెమెరాలు పనితీరు బేషుగ్గా పనిచేస్తుందని తద్వారా నేరాలను కూడా అదుపు చేసే అవకాశం ఉంటుందని పోలీసులు తెలిపారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజ్ పోలీస్ స్టేషన్లో రికార్డులను తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారి పట్ల మర్యాదగా మంచితనంతో వ్యవహరించాలని ఆయన పోలీస్ సిబ్బందికి సూచించారు. ముఖ్యంగా క్రిమినల్ నేరాలకు పాల్పడే నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి హెచ్చరించారు. గంజాయి, డ్రగ్స్, కోడిపందాలు, పేకాట లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ రోహిత్ రాజు స్పష్టంచేశారు. పోలీస్ స్టేషన్లో పెండింగ్ కేసుల్ని త్వరగా కోర్టుకి రిమాండ్ చేయాలని పోలీసులను ఆదేశించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జూదం, కోడిపందాలు ఆడేవారిపట్ల పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ కోరారు. అందుకు అనుగుణంగా ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ప్రజలు కూడా యూనిఫామ్ లేని పోలీసు లేనని, నేరాలను అదుపు చేయడం లాండ్ ఆర్డర్ ను కంట్రోల్ చేయడం ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో స్థానిక డిఎస్పి వంగా రవీంద్రారెడ్డి, సీఐ సతీష్ కుమార్ ఎస్సైలు, మేడే ప్రసాద్, రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

# ప్రజలకు సేవలందించేందుకే ప్రభుత్వ కార్యాలయాలు




**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజలకు సేవలందించేందుకే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని దుమ్ముగూడెం సిఐ అశోక్ కుమార్, గ్రామీణ బ్యాంకు మేనేజర్ ప్రకాష్ అన్నారు. ప్రభుత్వ కార్యాలయాల క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా దుమ్ముగూడెం మండల పరిధిలోని లక్ష్మీ నగరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు హెచ్ఎం బొడ్డు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్, పోస్టాఫీస్, ప్రభుత్వాస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సిఐ అశోక్ కుమార్, బ్యాంకు మేనేజర్ ప్రకాష్, వైద్యాధికారి పుల్లయ్య, పోస్టాఫీస్ బ్రాచ్ అధికారి ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడుతూ ఆయా కార్యాలయాల విధి విధానాలు, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో వివరించారు. బ్యాంకు, పోస్టాఫీస్‌లో నగదు పొదుపు చేసుకోవచ్చని, పోలీస్ స్టేషన్ ద్వారా అన్యాయాలు, నేరాలను అరికట్టేందుకు వీలవుతుందని, పేదలకు వైద్య సేవలు అందించేందుకు ఆస్పత్రులు ఉంటాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పై చదువులు సాగిస్తే చక్కటి ఉద్యోగాలు సంపాదించి మంచిగా స్థిరపడవచ్చని సూచించారు. చదువులను ఎవ్వరూ అశ్రద్ద చేయవద్దని, చదువు మనిషి జీవితాన్ని, జీవన గమనాన్ని మారుస్తుందని వివరించారు. తామంతా మీకులాగానే చిన్నతనంలో బడిలో చేరి చదువుకుని ఉద్యోగాలు సాధించామని, మీరంతా రాబోయే రోజుల్లో ఉద్యోగాలు సాధించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తెచ్చిపెట్టి సమాజంలో గుర్తింపు పొందాలని సూచించారు. విద్యార్థులకు ప్రభుత్వ కార్యాలయాల పనితీరును తెలిపేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకొచ్చిన ప్రధానోపాధ్యాయుడు బొడ్డు నాగేశ్వరరావును ఆయాశాఖల అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని హైమావతితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# విజయవంతమైన ఉచిత కంటి ఆపరేషన్లు



**ప్రజాపక్షం/మణుగూరు:** మండల పరిధిలోని రామానుజవరం పంచాయతీ పరిధిలో మణుగూరు ఏరియా సింగరేణి సంస్థ సహకారంతో మరియు ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ సంజీవ్ రావు పర్యవేక్షణలో శనివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరంలో 38 మంది గ్రామస్థులకు కంటి ఆపరేషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. వైద్య పరీక్షల అనంతరం, కంటి సమస్యలతో బాధపడుతున్న 38 మందికి సింగరేణి సంస్థ సహాయంతో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించి, కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం లబ్ధిదారులు ఎంతో సంతృప్తిగా, ఆనందంగా ఉన్నారు. కంటి చూపు మెరుగుపడటంతో వారి దైనందిన జీవితం మరింత సులభమైందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఆపరేషన్ పూర్తయిన అనంతరం వారికి అవసరమైన మందులు, ఐ డ్రాప్స్ మరియు తగిన సూచనలు ఉచితంగా అందించబడ్డాయి. ఈ కార్యక్రమంలో భద్రాచలం ప్రాంతానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కాంతారావు మరియు భద్రాచలం విద్యుత్ శాఖ అధికారి పాల్గొని, లబ్ధిదారులను కలుసుకున్నారు. డాక్టర్ కాంతారావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఎంతో అవసరం అన్నారు. కంటి చూపు సమస్యలు నివారించేందుకు ముందుగానే చికిత్స చేయించుకోవడం అవసరం అని పేర్కొన్నారు. భద్రాచలం విద్యుత్ శాఖ ఏడి మాట్లాడుతూ సామాజిక బాధ్యతగా ప్రజలకు సేవ చేయడంలో సింగరేణి సంస్థ అగ్రభాగాన ఉందన్నారు. ఈ శిబిరం ద్వారా అనేక మంది గ్రామస్తులు లబ్ధి పొందడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా బాడీష సతీష్ మాట్లాడుతూ ప్రజారోగ్యం మా ప్రధాన లక్ష్యం అని, గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ కల్పించడం మా బాధ్యతగా భావిస్తున్నామన్నారు. ఈ ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం ద్వారా, కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి మేము సహాయం చేయగలగడం చాలా ఆనందంగా ఉంది అని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తోడ్పడిన సింగరేణి సంస్థ, డాక్టర్ సంజీవ్ రావు, డాక్టర్ కాంతారావు , భద్రాచలం విద్యుత్ శాఖ అధికారి, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు స్వచ్ఛంద సంస్థలకు బాడీష సతీష హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# టెలికం బోర్డ్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా ఉమ్మినేని



**ప్రజాపక్షం/బోనకల్:** బిఎస్ఎన్ఎల్ టెలికం బోర్డు అడ్వైజరీ కమిటి మెంబర్‌గా మండల పరిధిలోని గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మికృష్ణ నియమించబడ్డారు. ఈ నియామక పత్రాన్ని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రాంసహాయం రఘురాంరెడ్డి చేతుల మీదుగా శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. .కాంగ్రెస్‌లో ప్రాధాన్యత కల్పించి, తనకు అవకాశం ఇచ్చినందుకు బిఎస్ఎన్ఎల్ అభివృద్ధిలో కృషి చేస్తానని అన్నారు. అడ్వైజరీ మెంబర్‌గా ఎన్నికలో సహకరించిన డిప్యూటీ సిఎం మల్లు భట్టీవిక్రమార్కకు, ఖమ్మం ఎంపి రఘురాంరెడ్డికు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావుకు, రెవెన్యూ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డికు, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తంబూరు దయాకర్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# అసంపూర్తిగా నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణం..!

**-ఆగిపోయిన నిర్మాణంలో రేకులేసుకునేందుకు సిద్ధమవుతున్న వ్యాపారులు**

**-వెజిటేబుల్ మార్కెట్‌కు కేటాయించాలని చిరు వ్యాపారుల డిమాండ్**








**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న పాత కూరగాయల మార్కెట్‌ను అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో సమీకృత మార్కెట్‌ని ఏర్పాటు చేసేందుకు నిర్మాణాలు చేపట్టారు. తెలంగాణ రాష్ట్రంలో బిఆర్ఎస్‌ప ఆర్టీ అధికారం కోల్పోవడం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం జరిగింది. ఈ క్రమంలో వైరాలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఇటవీల కాంలో హరిత రెస్టారెంట్ వద్ద వెజిటేబుల్స్ మార్కెట్ తాత్కాలిక ఏర్పాటు చేసుకున్న వ్యాపారులను కొనసాగిస్తున్నారు. అయితే హరిత భవనాన్ని మరల రీఓపెన్ చేస్తున్నారని ఇప్పుడు వైరాలో చక్కెరలు కొడుతుంది. ఈ క్రమంలోనే పాత కూరగాయల మార్కెట్‌లో అసంపూర్తిగా నిలిచిన నాన్‌వజ్ మార్కెట్ పనులు నేపద్యంలో ఏర్పాటు చేసిన పిల్లర్లు ఉండడంతో రేకులు వేసుకొని మరల ఇక్కడే కూరగాయల వ్యాపారం కొనసాగించుకునేందుకు వ్యాపారులు సిద్ధమంటున్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకొని పాత కూరగాయల మార్కెట్ అసంపూర్తిగా ఉన్న నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణంలో వెజిటేబుల్ మార్కెట్ కొనసాగే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే ఉన్న పిల్లర్లపై రేకులు వేసుకోవడానికి అనుకూలంగా ఉండటంతో మరల పాత స్థలంలోనే మార్కెట్ నిర్వహణ కొనసాగితే ఎంతో మంచిగా ఉంటుందని వారు తెలుపుతున్నారు. పాత కూరగాయల మార్కెట్ మరల కొనసాగించేందుకు అధికారులు ప్రజాప్రతినిధులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

# ముగింపు దశకు రివర్ ఫెస్టివల్ పనులు : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం:** ముక్కోటి ఏకాదశి సమీపిస్తున్నందున రివర్ ఫెస్టివల్ నిర్వహణ కోసం జరుగుతున్న పనులను ముంగింపు దశకు చేరుకున్నాయని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ తెలిపారు. శనివారం గోదావరి కరకట్ట ప్రాంతంలో చేపడుతున్న పనులను, తాత్కాలిక విడిది గృహాల ఏర్పాట్లు, వివిధ గిరిజన వంటకాలు, గిరిజన కళాఖండాలకు సంబంధించిన స్టాల్స్‌ను, పర్యాటకులు విహరించే బోట్ షికారును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ దాదాపు అన్ని పనులు చివరి దశకు చేరుకున్నాయని, కళాకృతులు, స్టాల్స్ నిర్మాణ పనులు వేగవంతంగా నడుస్తున్నాయన్నారు. విడిది గృహాల్లో పర్యాటకులు ప్రశాంతంగా సేదతీరేందుకు, తెప్పల మీద విహరించేందుకు బోట్ సౌకర్యం, బస చేసిన వారికి డైనింగ్ హాల్ ఏర్పాట్లు, విడిది చేసే ప్రాంతమంతా విద్యుత్ కాంతులు వెదజల్లేలా సోలార్ విద్యుత్ ఏర్పాట్లు చేయిస్తున్నట్లు తెలిపారు. చుట్టూ ఉన్న గోదావరి అందాలను సెల్ఫీ ద్వారా ఫోటోలు తీసుకోవడానికి సెల్ఫీపాయింట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్చరల్ ప్రోగ్రాంకు ఏర్పాట్లు కూడా సజావుగా జరుగుతున్నట్లు తెలిపారు. ప్రతీ కార్యక్రమంలో పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో వినిపించేలే సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం గోదావరి బోటులో సరదాగా విహరించి పర్యాటకులను ఆకర్షించే విధంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ వెంకటేశ్వరరావు, దేవస్థానం ఇఇ రవీంధర్, గ్రామపంచాయితీ ఇఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వరల్డ్ కంజ్యుమర్ రైట్స్ డబ్ల్యూసిఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ నియామకం



**ప్రజాపక్షం/కరకగూడెం:** హైదరాబాద్‌లోని డబ్ల్యూసిఆర్ జాతీయ కార్యాలయం లో డబ్ల్యూసిఆర్ (వ్యవస్థాపక) ఫౌండర్ జాతీయ చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ చేతుల మీదుగా వరల్డ్ కంజ్యూమర్ రైట్స్ డబ్ల్యూసిఆర్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ నియామకం జరిగింది. జిల్లా చైర్మన్‌గా సారిక లింగయ్య, డిప్యుటీ చైర్మన్ గా చెట్టిపల్లి దామోదర్, మీట్టపల్లి గోపి నియమితులు అయ్యారు. వారికీ కంజ్యూమర్ రైట్స్ నియామక పత్రాన్ని అందింజేసారు. ఈ సందర్భంగా డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ వినియోగ దారుల హక్కుల కోసం, వస్తు సేవల నాణ్యత ప్రమాణలను కాపాడటం కోసం ఎక్కడా వినియోగదారుడు మోసపోకుండా వారికీ అన్ని విధాలుగా వినియోగదారులకు సహాయ సహకారాలు అందిస్తామని, ప్రభుత్వం కీ ప్రజలకు మధ్యన వారధిల డబ్ల్యూసి వరల్డ్ కన్స్యూమర్ రైడ్స్ పని చేస్తుందని, ఎలాంటి అవకాతవకలు జరిగిన ప్రభుత్వ యంత్రాంగంకి తెలియజేసి వినియోగదారులను కాపాడుకుంటుంది డబ్ల్యూ సి ఆర్ కన్స్యూమర్ రైట్స్ చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. ఈ నియామకం తక్షణమే అమలులోకి వస్తుందనీ, తెలియపారు. ఈ కార్యక్రమంలో డబ్ల్యూసిఆర్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ చింత కింద మహేంద్ర గౌడ్, తెలంగాణ స్టేట్ వైస్ చైర్మన్ సత్యదేవ్, జిహెచ్ఎంసి వైస్ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌అండ్‌బిలో తికమక సూచిక బోర్డులు..!






**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బి శాఖ వారు కిలోమీటర్ల తేడాతో తికమక సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వలన ప్రయాణికులు బాటసారులు ప్రజలు తికమక్కపడుతూ ప్రయాణాన్ని చేస్తున్నారు. ఖమ్మం ఎంత దూరం, మధిర రహదారిలో ఉన్న సూచిక బోర్డుపై ఖమ్మం 54 కిలోమీటర్లు మరో బోర్డుపై 44 కిలోమీటర్లు రాసి ఉన్నది. దీనిపై 10 కిలోమీటర్లు తేడా ఉండటం వలన ఏది కరెక్టు ఏది కరెక్ట్ కాదు అని ప్రయాణికులు, బాటసారులు, మండల ప్రజలు తికమకతో ఉన్నారు. ఆర్ అండ్ బి లో ఇలా తికమక సూచిక బోర్డులు ఉండటం వల్ల ప్రజలు పలు విమర్శలు చేస్తున్నారు. దూరాన్ని తెలియపరిచే ఈ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో ఆర్ అండ్ బి శాఖ నిర్లక్ష్యం వహిస్తుందని దీనిపై ఆ శాఖ అధికారులు సవరించాలని ఆర్ అండ్ బి శాఖను ప్రజలు కోరుతున్నారు. నిద్రావస్థలో ఆర్ అండ్ బి శాఖ ఉందని పలువురు విమర్శిస్తున్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాల్సిందే..

**ప్రజాపక్షం/అశ్వాపురం:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరకాలం అవుతున్నా కూడా ఇంత వరకు రైతు రుణమాఫీ డబ్బులు రైతు ఖాతాల్లో జమ కాకపోవడం చాలా బాధాకరమని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రులు మాటలకే గాని చేతలకు ఉపయోగం లేదని మరో సారి నిరూపించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వమని బోనస్ అర కోరా రైతులకు జమ చేసి మిగతా రైతులను నట్టేట ముంచుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రూ 2500 ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర కాలంలో మహిళల ఖాతాల్లో రూపాయి కూడా జమ చేయని దుస్థితి ఉందన్నారు.

## మీరైనా కాస్త పట్టించుకోరూ..

**-డిప్యూటీ సీఎం భట్టికి డా బూసిరెడ్డి శంకర్‌రెడ్డి లేఖ**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** భద్రాచలం వైపు కరకట్ట నిర్మించిన నాటి నుండి బూర్గంపాడు, సారపాక వైపు కూడా కరకట్ట నిర్మించాలని మేము ఎన్నో విజ్ఞప్తులు చేసినప్పటికీ, 2024 నుండి బూర్గంపాడు పినపాక శాసన సభ్యులుగా పార్లమెంటు సభ్యులుగా గెలిచిన ప్రజాప్రతినిధులు విశ్వప్రయత్నాలు చేసినప్పటికీ నేటి వరకే కరకట్ట నిర్మాణానికి మోక్షం లభించలేదని, పోలవరం ముంపుకు గురవుతున్న బూర్గంపాడు, అశ్వాపురం మండల్లాని భూములను ముంపుకు గురవుతున్న ప్రాంతాలుగా ఇప్పటి వరకు గుర్తించలేదని, ఆర్ఓఆర్ ప్యాకేజీ కూడా ఇవ్వలేదని డాక్టర్ భూసిరెడ్డి శంకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం ప్రాంతం తెలంగాణలోనే కొనసాగేందుకు కృషి చేసిన వారిలో మల్లు భట్టి విక్రమార్క ప్రథమము అని ఈసందర్భంగా ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో అంచలంచలుగా ఎదిగి, ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న మీరైనా భద్రాచలం దేవాలయ అభివృద్ధి కోసం, భద్రాచల ప్రాంతంలో పర్యాటక అభివృద్ధి కోసం, భద్రాచలం ప్రాంత సత్వర అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ద వహించాలని, భద్రాద్రి ప్రాంత పరిరక్షణ సమితి అధ్యక్షులు డా బూసిరెడ్డి శంకర్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు రాసిన లేఖలో విజ్ఞప్తి చేశారు.

## రోహిత్‌ను అభినందించిన మల్లిబాబు




**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన వంగివరపు రోహిత్ శర్మ గత సంవత్సరం డిసెంబర్ 27 నుండి 30వ తారీఖు వరకు జరిగిన ఉత్తరప్రదేశ్, మధురలో టెన్నిస్ క్రికెట్ అండర్ 19, జాతీయ పోటీలలో పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచినందుకు డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ క్రీడల వలన మానసికోల్లాసము, ఆరోగ్యంతో పాటు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, ఈ రోజులలో పోటీలో గెలవడం అంటే మాములు విషయం కాదని, క్రమ శిక్షణ, ప్రతిభ ఉంటేనే తప్ప సాధ్యపడదని, ఒక మామూలు సాధారణ పూజారి కుమారుడు ఆ స్థాయికి ఎదగటం చాలా గొప్ప విషయమని, ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకొని రాణించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో బానోతు నరసింహనాయక్, శీలం పుల్లయ్య, భూక్య నాగేంద్ర బాబు, పాటిబండ్ల ప్రసాదు, బద్దల శేఖర్, రబ్బానీ పాషా, అంబటి పూడి వెంకటయ్య, రాయల నాగశంకర్, అంబడిపూడి వెంకటేశ్వర్లు, సీతా రామాంజనేయ శర్మ, మేకల లక్ష్మీ నారాయణ, మల్లికార్జున్, తిరపయ్యపాల్గొన్నారు.

## జర్నలిస్ట్ ముఖేష్ హత్య హేయం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ఛత్తీష్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన జర్నలిస్ట్ ముఖేష్ హత్యను ములకలపల్లి ప్రెస్ క్లబ్ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు శనివారం తిమ్మంపేటలో అత్యవసర సమావేశం నిర్వహించారు. జర్నలిస్టు ముఖేష్‌ను కాంట్రాక్టర్ పాశవింగా హత్యచేయడం వెనకాల అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని నివృత్తి చేయడం ప్రభుత్వ బాధ్యత అని క్లబ్ అధ్యక్షులు పి క్రాంతి అన్నారు. నిజాలను నిగ్గు తేల్చే యువ జర్నలిస్ట్ ముఖేష్‌కు మంచి పేరుందని గుర్తు చేశారు. నిజాలను నిర్భయంగా రాయలేని పరిస్థితులు దేశంలో ఉండటం మంచిది కాదన్నారు. ఇటీవల దేశంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయని అభిప్రాయాలను బయట పెట్టే స్వేచ్ఛ లేకుండా పోవడం బాధాకరమని అన్నారు. ప్రజాస్వామ్యం ఇలాంటి ఘటనలు జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసి భయభ్రాంతులకు గురి చేయడం అవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. దాడుల వెనక ఎలాంటి వ్యక్తులు ఉన్నా బయటకు తీసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పువ్వల శ్రీనివాస్, శేషగిరి, శివ ప్రసాద్, సురేష్, ఈశ్వరరావు, బషీర్, ఉదయ్, సునీల్, బోస్ పాల్గొన్నారు.

## ఈనెల 11 నుంచి టిసిసి పరీక్షల నిర్వహణ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఈనెల 11 నుంచి 17 వరకు డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హైయర్ (టిసిసి) కేటగిరిలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి సోమశేఖర శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షా హాల్ టికెట్స్ వెబ్ సైట్ నుంచి పొందాలని అభ్యర్థులు తమ హాల్ టికెట్, పరీక్షల ఇతర వివరాలకు www.bse.telangana.gov.in వెబ్‌సైట్‌ను చూడాలని డిఈవో తెలిపారు.

# చదువుతోపాటు క్రీడలు అవసరం

**-కెయు జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం**
**-వైస్ ఛాన్సలర్ ప్రొ|| కె. ప్రతాపరెడ్డి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చదువుతో పాటు క్రీడలు అవసరమని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె. ప్రతాపరెడ్డి తెలిపారు. శని వారం ఖమ్మం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల ఆధ్వ ర్యంలో జరుగుతున్న కాకతీయ యూనివర్సిటీ పరిధి క్రికెట్ పోటీలను వైస్ ఛాన్సలర్ కె. ప్రతాపరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో ఏ స్థాయిలో రాణిస్తున్నామో అన్న దానికి క్రీడా రంగం కొద్ది మేరకు ఉపయోగపడుతుందన్నారు. విద్య, క్రీడలు సమా జంలో కీర్తి ప్రతిష్టలు పెంచేందుకు ఉపయోగపడతాయన్నారు. కాక తీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ ఏడాది చాలా క్రీడాంశాలలో పోటీలు నిర్వహించామన్నారు. కెయు రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లా డుతూ కాకతీయ యూనివర్సిటీ పరిధి క్రీడలను విజయవంతంగా జరి పామని తెలిపారు. ఈ క్రీడా పోటీల ద్వారా ప్రతిభ కలిగిన వారు యూనివర్సిటీ తరుపున ప్రాతినిథ్యం వహించారని ఆయన తెలిపారు. కెయు స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి వై. వెంకయ్య మాట్లాడుతూ యూనివ ర్సిటీ పరిధిలోని ప్రతి జిల్లాకు ఇంటర్ జోనల్, ఇంటర్ యూనివర్సిటీ పోటీలను నిర్వహించామని తెలిపారు. ఖమ్మంలో జరుగుతున్నవి చివరి వని వీటితో ఈ ఏడాది క్రీడల ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ ఎం. నిరంజన్ రెడ్డి, సెక్రటరీ అండ్ కర స్పాండెంట్ కోటా అప్పిరెడ్డి, క్రికెట్ పోటీల కో ఆర్డినేటర్ డా|| బి.వెంకన్న, ప్రిన్సిపాల్ డా|| కెవి రమణారావు, యుసిపిఈ ప్రిన్సిపాల్ డా|| రవికుమార్, టోర్నీ ఆర్గనైజింగ్ కార్యదర్శి జె. ఉపేందర్, అధ్యాపకులు కమల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్, బిజెపి ఒకే తాను గుడ్డలు

**సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**



**ప్రజాపక్షం/చింతకాని :** ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్,బీజేపీ పార్టీలు ఒకే తాను గుడ్డలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు పేర్కొన్నారు. శనివారం చింతకాని మండల సీపీఎం పార్టీ కార్యా లయంలో మండల కమిటీ సమావేశం వత్సవాయి జానకిరాములు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో నున్నా మాట్లాడుతూ బీజేపీ,కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ పూర్తిగా అమ లుచేయడం లేదన్నారు. నరేంద్రమోడీ రైతువ్యతిరేక చట్టాలను మళ్లీ అమలుచేసే ఆలోచనలో ఉన్నారన్నారు. రైతు ప్రభుత్వమని అధికారం లోకి వచ్చిన రేవంత్ సర్కార్ పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకుండా రైతులను మభ్యపెడుతుందన్నారు.రబీ ప్రారంభమైనా నేటి వరకూ రైతు భరోసా లేదన్నారు. రైతు ను మోసం చేసిన ప్రభుత్వాలు మనుగడ సాధించిన దాఖలాలు చరిత్రలో లేవన్నారు.లక్షలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఆశలు పెట్టుకున్నారని దానిని అమలు చేయాల్సిన భాధ్యత ప్రభుత్వానిదేనన్నారు.తక్షణమే ఎలాంటి షరతులు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేసి రెండు సీజన్లకి సంబంధించి రైతు భరోసా ఎకరానికి రూ.15000/ అందిచాలన్నారు. కేంద్రంలో మోడీ తెచ్చిన నల్లచట్టాలను తక్షణమే రద్దుచేయాలని స్వామినాథన్ కమీషన్ సిఫార్సు లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేని పక్షంలో రైతుల తరు పున సీపీఎం ప్రజా ఉద్యమాలు చేపడుతుందన్నారు.ప్రభుత్వ వైఫల్యా లను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సమరానికి సిద్ధం కావాలని నాయకు లకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్రకమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు,మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాల రావు,మండల కార్యదర్శి రాచబంటి రాము,డివిజన్ కమిటీ సభ్యులు ఆలస్యం రవి,కాటబత్తిన వీరబాబు,అనిత మండలకమిటీ సభ్యులు వత్స వాయి జానకిరాములు,నన్నక కృష్ణమూర్తి,బల్లి వీరయ్య,గడ్డం రమణ,మద్దిన్ని బసవయ్య,పులి యజ్ఞనారాయణ,లింగం కొటేశ్వరరావు ,చింతకాని శాఖ కార్యదర్శి గడ్డం కోటేశ్వరరావు పాల్గొన్నారు.

# గురుకుల పాఠశాలల పనివేళలను తక్షణమే మార్చాలి

**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** గురుకుల పాఠశాలల పనివేళలను తక్ష ణమే మార్చాలని పిఆర్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షులు ఆర్.బ్రహ్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పిఆర్‌టియు మధిర మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని అన్ని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి పిఆర్‌టియు 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఉపా ధ్యాయులకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో తక్షణమే పనివేళలను మార్చాలని, పాత పద్ధతిలోనే ఉదయం 9గంటల నుండి 4.30 వరకు పాఠశాల పనివేళలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గురుకులాల్లో కేర్ టెకర్‌ను నియమిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధిర మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిలుకూరి సత్యనారాయణరెడ్డి, పోలె సుధాకర్, నాయ





కులు పిల్లి నర్సింహారావు, మల్లెల శ్రీనివాస్, సంగారావు, తెల్లమేకల శ్రీనివాసరావు, రుద్రపోగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హమాలీల సమ్మెతో నిలిచిన పేదల బియ్యం సరఫరా

**బియ్యం కోసం పేదలు ఎదురుచూపులు**



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గత వారం రోజులుగా సివిల్ సప్లై గోడౌన్ నుంచి చౌక ధరల దుకాణం కు సరఫరా కావాల్సిన బియ్యం నేటికి వారం రోజులుగా హమాలీల సమ్మెతో సరఫరా నిలిచిపోవడంతో గ్రామాలకు చేరనందున పేద ప్రజలు బియ్యం కోసం ఎదురుచూస్తున్నారు. కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఏన్కూరు, తల్లాడ , కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు సివిల్ సప్లై గోడౌన్ నుంచి మండలాలకు మండలం నుంచి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రేషన్ దుకాణాలకు చేరనందున పేద ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. మరికొందరు రెక్కాడితే డొక్కాడని ప్రజలు అవే తింటూ రోజువారి కాలాన్ని గడిపేవారు కానీ మొదటి తేదీ నుంచి దుకాణాల్లో అందించాల్సి ఉండగా నేటికీ అవి గ్రామాలకు చేరనందున పేదలు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై కల్లూరు ఆర్డీవో రాజేంద్రను వివరణ కోరగా రాష్ట్రవ్యాప్తంగా హమాలీలు సమ్మె చేస్తున్నారని సమస్య పరిష్కారం అయ్యేవరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్నామని ఆర్డిఓ తెలిపారు.

# ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కల్లూరు:** ప్రజాపక్షం దినపత్రికలో ప్రచుతమయ్యే కథనాలన్నీ ప్రజల కోసమేనని ఆర్డిఓ రాజేంద్ర అన్నారు. శని వారం ఆర్డీవో కార్యాల యంలో ప్రజాపక్షం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా రాష్ట్రంలో జిల్లా మండలంలో అనేక సమస్యలపై నిరంతరం పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజా సమస్యల కోసం నిరంతరం పనిచేస్తున్న పత్రిక అని అన్నారు. శనివారం ఆర్డిఓ కార్యాలయంలో కాలమానిని ఆవిష్కరించిన అనంతరం ఆయన ప్రజాపక్షంతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డి ఏ ఓ, రమేష్, డిటి వెంకటేశ్వరరావు, హరి, కృష్ణయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సోషల్ టాలెంట్ టెస్టులో రాష్ట్రస్థాయి ఎంపికైన భరత్ విద్యార్థి



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన భరత్ టెక్నో స్కూల్ విద్యార్థి శీలం రాజశేఖర్‌రెడ్డి శనివారం ఖమ్మం జిల్లా కేంద్రంలో తెలంగాణ స్టేట్ సోషల్ ఫారం వారు నిర్వహించిన జిల్లా స్థాయి సోషల్ టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా భరత్ విద్యాసంస్థల అధినేత శీలం విద్యాలత, వెంకటరెడ్డి విద్యార్థి నిని ప్రత్యేకంగా అభినందించి రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ చాటాలని శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జింకల కోటేశ్వరరావు, ఉమా, డీన్ రవీందర్‌రెడ్డి, స్రవంతి, సోషల్ టీచర్ భవాని, నాగరాజు అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఆర్‌పిఎస్ మహాప్రదర్శనను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/మధిర :** సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి సర్కార్ ఎస్సీ వర్గీకరణ అమలు చేయా లని కోరుతూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైద్రాబాద్‌లో జరుగనున్న మహాప్రదర్శనను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కూరపాటి సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం మధిరలోని స్థానిక కార్యాలయంలో మధిర మండల అధ్యక్షులు మేకల రాజామాదిగ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 7న వెయ్యి గొంతులు, లక్ష డప్పుల మహాప్రదర్శన ప్రపంచం చూడబోతుందని తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రారంభమయ్యే వెయ్యిగొం తుల, లక్ష డప్పుల రథయాత్రకు అన్ని వర్గాల కవులు, కళాకారులు, మాదిగ కళాకారులు, డప్పు కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు కొండూరు రాజేష్‌మాదిగ, తెల్లూరి రాజారత్నంమాదిగ, ఎంఎస్‌పి జిల్లా నాయకులు గట్టిగుండె కిషోర్ మాదిగ, కుక్కల బాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి



**ప్రజాపక్షం/చింతకాని :** మార్చిలో జరిగే పదోతరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు కృషిచే యాలని జిల్లా విద్యాశాఖాధికారి సోమశే ఖర శర్మ సూచించారు. శనివారం చింత కాని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మండల ప్రధానోపాధ్యాయుల సమావేశం ఎంఈవో వీరపనేని శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశంలో డిఈవో మాట్లాడుతూ పదోతరగతి ఫలితాల సాధనకోసం మరింత కృషిచేయాలని ,మధ్యాహ్న భోజన అమలుతీరును ప్రతిరోజూ పరిశీలించాలన్నారు. అనంతరం ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంఈవో శ్యాంసన్‌ను సన్మ నించారు. ఈ కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ అనంతరాజు,ఎంపీడీవో రామయ్య,టీఎస్ యూటీఎఫ్ నాయకులు జీడీఎస్‌వీ రమణ,తోటకూరి శ్రీనివాసరావు,పీఆర్‌టీయూ నాయకులు విజయభాస్కర్, ప్రభాకర్‌రెడ్డి,ఎస్‌టీఎఫ్ నాయకులు దేవరకొండ సైదులు,బీ సత్యనారాయణ, టీపీటిఎష్ నాయకులు చెన్నకేశవరెడ్డి, జలీల్‌భాషా,ప్రదానోపాధ్యాయలు తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్దార్‌ను కలిసిన యూటీఎఫ్ నాయకులు




**ప్రజాపక్షం/చింతకాని :** నూతన సంవ త్సరం సందర్భంగా చింతకాని మండల యూటీఎఫ్ నాయకులు తహసీల్దార్ అనంత రాజును మర్యాదపూర్వకంగా కలిసి సంఘం డైరీ ,క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల భాధ్యలు మాట్లాడుతూ ఇటీవల చేపట్టిన సమగ్ర సర్వే కి సంబంధించి విధులు నిర్వర్తించిన ఎన్యూమరేటర్లు,సూపర్‌వైజర్లకు పారితోషకం తక్షణమే అందించాలని తహసీల్దార్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్ష,కార్యదర్శులు జీడీఎ స్‌వీ రమణ, తోటకూరి శ్రీనివాసరావు,కోశాధికారి నాగేశ్వరరావు నాయకులు అనిల్ కుమార్ తది తరులు పాల్గొన్నారు.

# మెనూ చార్జీలు పెంచకుండా పోషకాహారం ఎలా..




**ప్రజాపక్షం/కూసుమంచి:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటియూసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈసందర్భంగా కూసుమంచి ఎంపీడీవో కార్యాలయం ఎదుట తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్(ఏఐటియూసి) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మండల అభివృద్ధి అధికారి వేణుగోపాల్‌రెడ్డికి అందించారు. ఈసందర్భంగా ఏఐటియూసి తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ, ఏఐటియూసి ఖమ్మం జిల్లా కార్యదర్శి గుండెపంగు మల్లేష్ మాట్లాడుతూ కార్మికులు పిల్లలకు అన్నం వండి వడ్డించడమే కాక వారు కిరాణా షాపుల వద్ద అప్పులు తీసుకువచ్చి వడ్డించడం జరుగుతుందని కానీ బిల్లులు మాత్రం అరకొరగా వస్తున్నాయని, ముఖ్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన కోడిగుడ్ల బిల్లులను 9, 10 తరగతుల బిల్లులను అల్పాహార బిల్లులను రాగి జావా తయారు చేసినందుకు గ్యాస్ బిల్లలు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని ఎప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల రావాల్సి బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచకుండా పోషక ఆహారం ఎలా పెట్టాలని, మెనూ చార్జీలను ప్రతి విద్యార్థికి 30 రూపాయలకు పెంచాలని కోడిగుడ్లను ప్రభుత్వమే ఇవ్వాలని, వంట గ్యాస్, వంట పాత్రలు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, 10లక్షల ఇన్సూరెన్స్ ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ పెన్షన్ తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ నాయకులు నెల్లూరు కోటమ్మ, మండవ కృష్ణకుమారి, నందిని, లక్ష్మి, సునీత, శాంతమ్మ, నిర్మల, సుగుణ, పార్వతి, మల్లమ్మ, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నాడు తహసీల్దార్ కరుణ శ్రీ చేతుల మీదుగా ప్రజాపక్షం దినపత్రిక. 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాపక్షం దినపత్రిక ప్రజల పక్షాన మంచి వార్తలు రాయడంలో ముందుండాలని ప్రభుత్వ పథకాలు ప్రజలు వినియోగించుకోవడంలో వారిని చైతన్య పరచాలని తన వంతుగా కూడా నిబద్ధతతో ప్రజలకు సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ఆర్ఐ రాము, ఆర్ఐ 2 జ్యోతి, కూసుమంచి మండల ప్రజాపక్షం దినపత్రిక రిపోర్టర్ ఎం భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ కోకో జిల్లా జట్ల ఎంపికలు



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు లోని శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సీనియర్ కోకో క్రీడాకారులు మహిళలు మరియు పురుషులు కల్లూరులోని మినీ స్టేడియం నందు వంద మంది క్రీడాకారులు హోరాహోరీగా తరబడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. మహిళల నుంచి 18 మందిని పురుషుల నుంచి 18 మందిని ఎంపిక చేసి ఈనెల 8, 9 తేదీలలో వరంగల్ జిల్లా గీసుకొండ లో జరుగు తెలంగాణ రాష్ట్ర కోకో పోటీలను కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల మరియు మినీ స్టేడియం నందు ఖమ్మం జిల్లా కోకో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించి ఎంపిక చేయడం జరిగింది. ఈ క్రీడాకారులకు స్ఫూర్తి ఫౌండేషన్ హైదరాబాద్ వారు క్రీడాకారులకు భోజన వసతి క్రీడా దుస్తులు వితరణ చేశారు. కోకో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వీర రాఘవయ్య మండల విద్యాశాఖ అధికారి నివేదిత, వరక రామారావు, పిడి, బీమా మహిళ, పీఈటీలు, రమాదేవి, శ్వేత, పద్మ, త్రివేణి, విజయ, సునీత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన వారందరికీ ధన్యవాదములు తెలిపారు.

# ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించండి

**-ఆర్‌డిఓను కోరిన యాతాలకుంట రైతులు**
**-8న కలెక్టర్ కార్యాలయంకు రావాలని తెలిపిన ఆర్‌డిఓ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సీతారామ ప్రాజెక్ట్ కాలువ నిమిత్తం గత ఐదు సంవత్సరాల క్రితం సేకరించిన భూములకు ప్యాకేజీ నేటి వరకు రాలేదని, తక్షణమే తమకు సీతారామ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందించాలని కల్లూరు ఆర్.డి.ఓ ను యాతాలకుంట రైతులు కోరారు. శనివారం సీతారామ ప్రాజెక్టు బ్రాంచ్ కెనాల్ కు కావలసిన 12 ఎకరాల భూ సేకరణకు సంబంధించి యాతాలకుంట పంచాయతీ కార్యాలయంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో పిసా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు ఆర్.డి.ఓను పలు విషయాలపై రైతులు ప్రశ్నించారు. పాత ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాలేదని, వచ్చిన ప్యాకేజీ సైతం పెంచి ఇవ్వాలని, భూములకు ప్రభుత్వమే రెండు పర్యాయాలు రేట్లు పెంచి చూపిన నేటి వరకు ఆ ప్యాకేజీ తమకు ఎందుకు అందజేయలేదని ప్రశ్నించినట్లు రైతులు తెలిపారు. గత ఐదు సంవత్సరాల క్రితం తమ భూములను సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి సేకరించారని, కానీ నేటి వరకు ఒక్క రూపాయి కూడా తమకు ప్యాకేజీ అందలేదని వాపోయారు. స్పందించిన ఆర్.డి.ఓ ఈనెల 8న కల్లూరు ఆర్.డి.ఓ కార్యాలయానికి తమ వివరాలతో రావాలని, విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపినట్లు రైతులు తెలిపారు. తమకు అర్ అండ్ ఆర్ ప్యాకేజి రాకపోతే పనులు అడ్డుకుంటామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాటి మోహన్ రావు, మాజీ ఉపసర్పంచ్ వెచ్చా రాంప్రసాద్, బాల శ్రీనివాసరావు, తాటి రామకృష్ణ, వలసపల్లి రమేష్, గడిపర్తి వెంకటేశ్వరరావు, సవలం ప్రభాకర్, తురసం భానుచందర్ పాల్గొన్నారు.

# సోషల్ టాలెంట్‌లో జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించిన టాలెంట్ స్కూల్ విద్యార్థి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలంగాణ సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన సోషల్ టాలెంట్ టెస్ట్ లో టాలెంట్ స్కూల్ విద్యార్థిని జలదాని తన్మయ్ శ్రీజ (87/100) ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థినికి షీల్డ్, 2000/నగదు బహుమతి ప్రశంసాపత్రంను జిల్లా ఫోరం బాధ్యులు అందించారు. జిల్లా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, సోషల్ టీచర్ మరియు స్కూల్ ఇన్చార్జ్ శంకర్ అభినందించారు

# ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎంను ఆదరించండి



**ప్రజాపక్షం/వైరా:** ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడుతున్న సిపిఎంను ఆదరించాలని, భవిష్యత్తులో నిర్వహించే పోరాటాల్లో కలిసి రావాలని, సిపిఎం బలపడితేనే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని వైరా మున్సిపాలిటీ పరిధిలోని పదో వార్డు గండగలపాడు గ్రామంలో ఆయన ప్రారంభించారు. ప్రజా సమ్యలు తెలుసుకొని వాటి పరిష్కారం కోసం భవిష్యత్తులో అనేక పోరాటాలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అన్నారు. ఇంటింటికి సిపిఎం కార్యక్రమాన్ని ప్రజలు ఆదరించి ఉద్యమాలను బలపరచాలని, భాగస్వాములు కావాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతి రావు, డివిజన్ కమిటీ సభ్యురాలు మచ్చా మణి, శాఖ కార్యదర్శి గుమ్మా నర్సింహారావు, పార్టీ పట్టణ నాయకులు మల్లెంపాటి రామారావు, కామినేని రవి, పల్లెబోయిన వెంకటేశ్వర్లు, పల్లెబోయిన కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య మిత్రుడిని పరామర్శించిన మువ్వా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** టిజిఐడిసి చైర్మన్ మువ్వా విజయబాబు చిన్ననాటి మిత్రుడు గుడిమల్ల లక్ష్మణరావు (సిటీ కేబుల్) అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని, మరోక మిత్రులైన మల్లెల నరసింహారావు గారితో కలసి శనివారం వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వారికి ధైర్యం చెప్పారు.

# తీర్థ ప్రసాదాలు పంపిణీ



**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్ :** పాల్వంచ పట్టణంలో శ్రీరామాలయ భజన మందిరంలో ధనుర్మాస వ్రతంలో భాగంగా 20వ పాశురం(ముత్తు మావ అమరర్కు 33 కోట్ల దేవతలకు రక్షణ కల్పిస్తూ వీటిని పురస్కరించుకొని జరుగుతున్న పూజలలో భాగంగా దర్పణంలో స్వామిని దర్శిస్తూ వింజమరలు వీస్తూ అట్ ఫట్ సేవలు చేశారు. ఆలయ వేద పండితులు వంశీ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పూజలకు వచ్చిన భక్తులకు ఏ లోటు లేకుండా తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో తిరుప్పావై మహిళా కమిటీ సభ్యులు ప్రతి రోజు తెల్లవారుజామున వచ్చి స్వామి వారి దర్శనం చేసుకుని తీర్థప్రసాదాలు తీసుకొని వెళుతున్నారు. ఈకార్యక్రమంలో పెండ్యాల రోజ్యలక్ష్మి, చలవాది రాజ్యలక్ష్మి, చిరునోముల బిందు, శ్రీలక్ష్మి, గుబ్బల దుర్గ, తాటికొండ స్వప్న, కొప్పరపు సౌజన్య, తాటిపల్లి దీప్తి, విశ్వాంబరి, శ్యామల, కంటాల భారతి, ఇందిరా, కొప్పరపు నాగ, బచ్చు విజయ, కొత్తగుండ్ల తేజ పాల్గొన్నారు.

# పుస్తక పఠనంలో వైరా స్టడీ సర్కిల్ అరుదైన కృషి

**స్టడీ సర్కిల్ కన్వీనర్, మాజీ ఎంపిపి బొంతు సమత**



**ప్రజాపక్షం/వైరా:** పుస్తక పఠనంలో వైరా స్టడీ సర్కిల్ అరుదైన కృషి కొనసాగిస్తుందని స్టడీ సరర్కిల్ కన్వీనర్ వైరా మాజీ ఎంపిపి బొంతు సమత అన్నారు. వైరా స్టడీ సర్కిల్ 2010 జనవరి 3 చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి రోజున ప్రారంభం అయిందని అన్నారు. ఆదివారం అధ్యయనం పేరుతో ప్రతి ఆదివారం 15 సంవత్సరాల నుంచి 780 ఆదివారాలు క్రమం తప్పకుండా ఉదయం 6.30 గంటల నుంచి 9గంటల వరకు సమకాలిన రాజకీయ అంశాలతో పాటు ఎంపిక చేయబడిన పస్తకాలు భారత జాతీయోద్యమ చరిత్ర, భారతీయ తత్వశాస్త్రం, రామాయణం, గీత, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర, భారత రాజ్యాంగం, ప్రపంచ మహానీయులు, జీవిత చరిత్రలు, అనేక సాహిత్య సాంస్కృతిక పుస్తకాలు అధ్యయనం చేయడం జరుగుతుందని అన్నారు. అధ్యయనం కాలక్షేమం, కుతహలం కోసం కాకుండా సమాజ మార్పు కోసం ఉపయోగపడాలని సంకల్పంతో నిర్వహిస్తున్నామని అన్నారు. అనేక మంది తమ తమ వృత్తుల్లో సామాజిక బాధ్యత కలిగిన పౌరులుగా స్టడీ సర్కిల్ సభ్యులు రాణిస్తూ స్టడీ సర్కిల్ ఔన్నత్యం సాగుతున్నారని అన్నారు. 16 సంవత్సరంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జరిగే కార్యక్రమంలో స్టడీ సర్కిల్ వ్యవస్థాపక సభ్యులు బొంతు రాంబాబు, పారుపల్లి చంద్రశేఖర్,బాబు, వైరా స్టడీ సర్కిల్ మాజీ కన్వీనర్ బోడపట్ల రవి, సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం తదితరులు పాల్గొంటారని సమత తెలిపారు.

# రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా మాసోత్సవాలు సందర్భంగా వైరా మోటార్ వెహికిల్ ఇన్స్‌క్టర్ వరప్రసాద్ శనివారం వైరాలోని మధు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మోటార్ వెహికిల్ ఇన్స్‌పెక్టర వరప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, వాహనాలు ఏ విధంగా నడపాలి, ట్రాఫిక్ సిగ్నల్స్ నిబంధనలు ఏ విధంగా ఉండాలి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, అతివేగం ప్రమాదకరం అనే అంశాలపై వరప్రసాద్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మధు పాఠశాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

